ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్త విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ.22.09.2025 సమయం. 1310 గంటలు

ముఖ్యాంశాలు

1. సింగరేణి సంస్థ గత ఆర్థిక సంవత్సరంలో సాధించిన లాభాల్లో కార్మికులకు వాటా చెల్లింపు వివరాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈరోజు ప్రకటించారు.
2. దేశంలోనే అతిపెద్ద ఏరోస్పేస్, డిఫెన్స్ హబ్‌గా తెలంగాణాను తీర్చిదిద్దనున్నట్లు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు చెప్పారు.
3. ఆయిల్ పామ్ సాగులో మన రాష్ట్రం దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిచిన నేపథ్యంలో భవిష్యత్తులో తెలంగాణ ఆయిల్ పామ్ హబ్ గా మారుతుందని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు చెప్పారు.
4. రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో ఈరోజు భారీ వర్షాలు కురిసే అవకాశం వుందని ప్రాంతీయ వాతావరణ కేంద్రం ఎల్లో అలర్ట్ జారీ చేసింది.

సింగరేణి:

సింగరేణి సంస్థ గత ఏడాది ఆర్జించిన లాభాల్లో కార్మికులకు లక్షా 95 వేల రూపాయిల చొప్పున దసరా బోనస్ ను రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సచివాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఈ విషయం గురించి తెలియజేశారు. కాంట్రాక్టు కార్మికులకు కూడా ఐదున్నర వేల రూపాయిలను బోనస్ గా ప్రకటించారు. దీనివల్ల 30 వేలమంది ఉద్యోగులు, కార్మికులకు లబ్ది చేకూరుతుంది. సంస్థకు గత ఆర్థిక సంవత్సరం 6 వేల మూడు వందల కోట్ల రూపాయిలకు పైగా లాభాలు రాగా, అందులో రెండు వేల మూడు వందల కోట్ల రూపాయలకు పైగా బోనస్ గా అందజేస్తున్నట్లు ముఖ్యమంత్రి చెప్పారు. కార్మికుల సంక్షేమం కోసం తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చెప్పారు. ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వివేక్ వెంకటస్వామి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, శ్రీధర్ బాబు, పలువురు ప్రజా ప్రతినిధులు ఉన్నతాధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

(సౌండ్ బైట్ – సిఎమ్)

MSL

పెట్టుబడులు:

ఏరోస్పేస్, డిఫెన్స్ రంగాల్లో రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని ఇటలీ పారిశ్రామిక వేత్తలను రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి D శ్రీధర బాబు కోరారు. హైదరాబాద్ లోని రాష్ట్ర సచివాలయంలో ఇటలీ పారిశ్రామికవేత్తలతో మంత్రి సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, దేశంలోనే అతిపెద్ద ఏరోస్పేస్–డిఫెన్స్ కేంద్రంగా రాష్ట్రం తయారు కాబోతోందని మంత్రి చెప్పారు. అలాగే రాష్ట్రంలో పెట్టుబడులకు అవకాశాలు విస్తారంగా ఉన్నాయని, విడి భాగాల తయారీ, సప్లై చెయిన్ వంటి అంశాలలో పెట్టుబడులు పెట్టాలని కోరారు. మెయింటెనెన్స్, మరమ్మతులు, ఓవర్‌హాల్ వంటి రంగాలలో కూడా విశేష అవకాశాలున్నాయని మంత్రి వివరించినట్లు అధికారిక ప్రకటన పేర్కొంది.

MSL

ఆయిల్‌పామ్ తెలంగాణ ఫస్ట్

దేశవ్యాప్తంగా ఆయిల్‌పామ్ సాగును పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం చేపట్టిన నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్స్ (ఎన్‌ఎంఈవో) పథకం అమలులో రాష్ట్రం అగ్రస్థానంలో నిలిచింది. 2021 నుంచి ఐదేళ్ల కాలానికి కేంద్రం 3 లక్షల హెక్టార్ల పైచిలుకుసాగు లక్ష్యాన్ని తొమ్మిది రాష్ట్రాలకు నిర్దేశించింది. అందులో మన రాష్ట్రం 1లక్షా 25వేల 300 హెక్టార్ల లక్ష్యానికి గానూ, 78వేల 869 హెక్టార్లలో సాగు చేసి 63శాతంతో ముందువరుసలో నిలిచింది. ఈ మేరకు కేంద్రం రాష్ట్ర ఉద్యానశాఖకు సమాచారం అందించింది. పథకం అమలులో ఆంధ్రప్రదేశ్ 67వేల 727 హెక్టార్ల సాగుతో రెండో స్థానంలో నిలిచింది.  ఒడిశా, కర్ణాటక, ఛత్తీస్‌గఢ్, తమిళనాడు, కేరళ, గోవా, గుజరాత్ వరుసగా తర్వాత స్థానాల్లో నిలిచాయి. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు మాట్లాడుతూ రాష్ట్రం ఆయిల్ పామ్ హబ్ గా మారుతోందని చెప్పారు.

- డెస్క్

22 09 2025 Seva Parv-10

అందుబాటులో గృహ వసతి:

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం సేవా-సుపరిపాలనే మంత్రంగా దేశంలో పరివర్తన కోసం నిరంతరం కృషి చేస్తోంది. సేవా పర్వ్ - సీరీస్ లో భాగంగా, మోదీ ప్రభుత్వం దేశ వ్యాప్తంగా పేదలకు అందుబాటు ధరల్లో గృహాలను అందించటం ద్వారా జీవన సౌలభ్యాన్ని మెరుగుపరిచిన తీరుపై ప్రత్యేక కథనం అందిస్తున్నాం.

(Voice Package)

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని ప్రభుత్వం గత 11 ఏళ్ళుగా దృఢ సంకల్పంతో, పరివర్తనకు బీజాలు వేసింది. పౌర కేంద్రీత సంస్కరణలతో ముఖ్యంగా పేదలు, అణగారిన వర్గాల జీవన ప్రమాణాలను మెరుగు పరిచేందుకు, వారికి అందుబాటు ధరల్లో గృహాలను

అందించేందుకు కృషి చేసింది. గృహనిర్మాణాన్ని సరసమైన ధరలకు అందించటంపై ప్రధాని మోదీ ఇలా చెప్పారు.

(PM MODI BYTE)

ఈ దార్శనికతతో, నాణ్యమైన గృహాలను అందించేందుకు ప్రభుత్వం ప్రధాన మంత్రి పట్టణ ఆవాస్ యోజన, ప్రధానమంత్రి గ్రామీణ్ ఆవాస్ యోజన పేరుతో రెండు విస్తృత మిషన్లను చేపట్టింది. నగరాలలో స్మార్ట్ సిటీస్ మిషన్ కింద లక్షన్నర కోట్ల రూపాయిలతో ఏడున్నర వేల ప్రాజెక్టులు పూర్తయ్యాయి. ఇంకా, UJALA పథకంతో ప్రభుత్వం నివాసాలను LED బల్బులతో వెలిగిస్తోంది. PM ఉజ్వల కింద పరిశుభ్రమైన వంట ఇప్పుడు వాస్తవ రూపం ధరించింది. జల్-జీవన్ మిషన్ తో గ్రామాలకు ఇప్పుడు స్వచ్ఛమైన నీరు అందుతోంది. పట్టణ, గ్రామీణ ప్రాంతాలు స్వచ్ఛ భారత్ మిషన్ తో పరిశుభంగా కనిపిస్తున్నాయి. గౌర్వంగా జీవించటం అంటే అది ఒక వాగ్దానమే కాదు, జీవించి చూపటమనే భవితను భారత్ ఇప్పుడు స్థిరంగా రచిస్తోంది.

ఎంఎస్ఎల్

తెలంగాణ - అల్మట్టి ఎత్తు

కృష్ణా నదిపై ఆల్మట్టి ఆనకట్ట ఎత్తు పెంచాలన్న కర్ణాటక ప్రభుత్వ ప్రతిపాదనను రాష్ట్ర ప్రభుత్వం వ్యతిరేకిస్తోంది. ఆల్మట్టి ఆనకట్ట ఎత్తు పెంచాలన్న కర్ణాటక ప్రతిపాదనపై ప్రభుత్వం తన వాదనను వినిపిస్తుందని నీటిపారుదల మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. నిన్న సాయంత్రం సూర్యాపేట జిల్లాలో ఆయన మాట్లాడుతూ, సుప్రీంకోర్టు ప్రస్తుతం ఈ కేసును విచారిస్తోందని, దీనికోసం తాను ఈరోజు ఢిల్లీకి వెళ్తున్నానని మంత్రి చెప్పారు. కృష్ణా, గోదావరి జలాల్లో రాష్ట్ర వాటా విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడబోమని ఆయన అన్నారు.

ఎన్ఎస్ డీ

**BREAK**

ఆకాశవాణి ప్రాంతీయ వార్తలు వింటున్నారు. మరిన్ని Updates కోసం హైదరాబాద్ ప్రాంతీయ వార్తా విభాగం "ఎక్స్" handle @ airnews_hyd ని ఫాలో అవండి. AIR News Hyderabad YouTube Channel కి సబ్ స్క్రైబ్ చేయండి.

జీఎస్టీ స్టార్ట్

ఈరోజు నుంచి దేశ వ్యాప్తంగా వస్తు సేవల పన్ను (GST 2.0) అమలులోకి వచ్చిన సందర్భంగా జీఎస్టీ ఉత్సవ్ మొదలయ్యింది. ఈ నెక్స్ట్ జెన్ జీఎస్టీతో 375 రకాల ఉత్పత్తులపై పన్ను ధరలు తగ్గనున్నాయి. ప్రధానంగా మందులు, పలు నిత్యావసర వస్తువులపై జీఎస్టీ 12 శాతం నుంచి 5శాతానికి తగ్గింది. ఆరోగ్య బీమా, పలు స్టేషనరీ వస్తువులపై జీఎస్టీ వేయడం లేదు.

డెస్క్

సిరిసిల్ల జీఎస్టీ

పేద, మధ్యతరగతి కుటుంబాల ప్రయోజనాల కోసం కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు ఉపయోగకరంగా ఉంటున్నాయని రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన సిమెంట్, టైల్స్ వ్యాపారి కంబాల సతీష్ చెప్పారు. ఆకాశవాణితో ఆయన మాట్లాడుతూ.. సిమెంటు పై ఉన్న జీఎస్టీ స్లాబ్ ను 28 నుంచి 18శాతానికి కుదించడంతో ఇళ్ల నిర్మాణ వ్యయం తగ్గనుందని అన్నారు.

(సౌండ్ బైట్ - కంబాల సతీష్, రాజన్న సిరిసిల్ల జిల్లా)

పీటీసీ - రాజన్న సిరిసిల్ల

PM-VISIT

తమ ప్రభుత్వం లక్ష్యం ఓట్లు, సీట్ల లెక్క కాదని, నేషన్ ఫస్ట్, దేశమే ముఖ్యమని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చెప్పారు. దేశ అభివృద్ధి లక్ష్యాలను నెరవేర్చడంలో ఈశాన్య రాష్ట్రాలు తమ వంతు పాత్ర సమర్థవంతంగా పోషిస్తున్నాయని ప్రధానమంత్రి అన్నారు. ఈ ఉదయం

అరుణాచల్ ప్రదేశ్ లో అనేక అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రారంభోత్సవాలు, శంఖు స్థాపనలు చేసిన అనంతరం మాట్లాడుతూ ప్రధానమంత్రి, తన అరుణాచల్ ప్రదేశ్ పర్యటన ప్రధానంగా మూడు కారణాల వల్ల ప్రత్యేకత సంతరించుకుందని,శైల పుత్రి పూజ రోజు పర్వతాల దర్శనం అవుతోందని, GST సంస్కరణ అమలు., పొదుపు ఉత్సవం ప్రారంభమైందని, అరుణాచల్ ప్రదేశ్ లో అనేక అభివృద్ధి ప్రాజెక్టులు ఈరోజు ప్రారంభమౌతున్నాయని ఆయన చెప్పారు. అనంతరం ప్రదానమంత్రి త్రిపుర బయలుదేరి వెళతారు. అక్కడ మాతా త్రిపుర సుందరి ఆలయ సముదాయంలో నూతనంగా అభివృద్ధి పరిచిన మౌలిక సదుపాయాలను సుందరీకరణ పనులను ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రారంభిస్తారు. ప్రధానమంత్రి పర్యటన కోసం త్రిపురలో విస్తృతంగా భద్రతా ఏర్పాట్లు చేశారు.

NSD

రేపటిలోగా రిజర్వేషన్ల ఖరారు

రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల కోసం రిజర్వేషన్ల ఖరారు ప్రక్రియ ఈరోజు నుంచి మొదలవుతోంది. నిన్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఇచ్చిన ఆదేశాలతో జిల్లాల స్థాయిలో కలెక్టర్లు ఈరోజు అధికారులతో సమీక్షిస్తున్నారు. జడ్పీటీసీ, జడ్పీ ఛైర్‌పర్సన్, ఎంపీటీసీ, ఎంపీపీ, సర్పంచ్, వార్డు సభ్యుల రిజర్వేషన్ల ప్రక్రియను రేపటిలోగా ఖరారు చేయాలని ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు అన్ని జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. నిన్న ఆయన కలెక్టర్లు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్లు, జడ్పీల సీఈవోలు, జిల్లా పంచాయతీ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బీసీలకు కులగణన సర్వే ద్వారా 42 శాతం, ఎస్సీ, ఎస్టీలకు 2011 జనాభా లెక్కల ప్రకారం రిజర్వేషన్లను ఖరారు చేయాలన్నారు. మహిళా రిజర్వేషన్ల కోసం రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో లాటరీ తీయాలని సూచించారు. రిజర్వేషన్ల ఖరారు వివరాలను బయటికి వెల్లడించరాదని.. ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం నిర్ణయం తీసుకొని రిజర్వేషన్ల శాతంపై జీవో జారీ చేశాకే వాటి వివరాలను ప్రకటించాలని సూచించారు.

డెస్క్

బతుకమ్మ భట్టి

భక్తిశ్రద్ధలతో గౌరమ్మను పూజించే మహిళల పూజలు ఫలప్రదమై రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఆదివారం రాత్రి వరంగల్ లో తెలంగాణ సంగీత అకాడమీ ఆధ్వర్యంలో కాకతీయ నృత్య ప్రదర్శనతో పాటు, వేయి స్తంభాల గుడి వద్ద బతుకమ్మ పండుగ ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా బతుకమ్మ పండుగ నిర్వహిస్తున్నామన్నారు . రాష్ట్రంలో మహిళలంతా ఆర్థికంగా, శక్తివంతులుగా ఎదగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, సీతక్క, కొండా సురేఖ తదితరులు పాల్గొన్నారు.

పీటీసీ వరంగల్

వేములవాడ నవరాత్రి

దేవీ నవరాత్రి ఉత్సవాలలో భాగంగా రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారు మొదటి రోజు శైలపుత్రి అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆలయ అర్చకులు వేకువ జాము నుంచే ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అమ్మవారు శైలపుత్రి అలంకారంలో దర్శనమివ్వగా అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. శైలపుత్రి అలంకారానికి సంబంధించిన విశేషాలను ఆలయ అర్చకులు భక్తులకు వివరించారు.

పీటీసీ సిరిసిల్ల

కరీంనగర్ జాగ్రత్త

దసరా, బతుకమ్మ పండుగల సందర్భంగా తమ ఇళ్లకు తాళాలు వేసి సొంత ఊళ్లకు వెళ్లేవాళ్ళు జాగ్రత్తలు తీసుకోవాలని కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం సూచించారు. ఈ సమయంలో చోరీలను నివారించడానికి కరీంనగర్ పోలీసులు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నారని ఒక ప్రకటనలో తెలిపారు.

పీటీసీ కరీంనగర్

వర్షాలు

రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో  నిన్న రాత్రి భారీ వర్షాలు కురిశాయి. యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరులో 12.6 సెంటీమీటర్లు, జనగామ జిల్లా దేవరుప్పులలో 12.2 సెంటీమీటర్ల వర్షపాతం నమోదయ్యింది.

పీఎన్, పీటీసీ యాదాద్రి భువనగిరి

వాతావరణం

రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో ఈరోజు భారీ వర్షాలు కురిసే అవకాశం వుందని ప్రాంతీయ వాతావరణ విభాగం తెలియజేసింది. రాష్ట్రమంతటికీ ఈ మేరకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. రేపు కూడా రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురవవచ్చని పేర్కొంది.

పిఎన్

CLOSING

ఆకాశవాణి వార్తలు ఇంతటితో సమాప్తం. తిరిగి సాయంత్రం  6 గంటల 10 నిమిషాలకు ప్రాంతీయ వార్తలు వింటారు.